కూరగాయల ధరలు

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో (కిలో.. రూపాయల్లో...) టమాటా.13, నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 18, బెండకాయ 23, పచ్చిమిర్చి 35, బజ్జీమిర్చి 35, క్యాప్సికమ్ 47, పచ్చకాకర 32, పందిరి బీర 35, క్యాబేజీ 13, క్యారెట్ 27, దొండ 40, గుండుబీన్స్ 45, గింజ చిక్కుడు 35, గోకరకాయ 28, కీర 18, దోసకాయ 15, బీట్‌రూట్ 35, ఉల్లిగడ్డ 35, ఆలుగడ్డ 25, చామగడ్డ 37, మొరంగడ్డ 23, కందగడ్డ 50, సొరకాయ 11, పొట్లకాయ 13, అరటికాయ 9, మునగకాయ 4–5, ముల్లంగి 5–6. ఈ ధరలు శనివారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

సనత్‌నగర్: సంజీవయ్యపార్కు, ఎయిర్‌పోర్ట్ సబ్‌స్టేషన్ల పరిధిలోని విద్యుత్ ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో కరెంటు సరఫరా నిలిపివేయనున్నట్లు గ్రీన్‌ల్యాండ్స్ సీబీడీ ఏడీఈ చరణ్‌సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు బేగంపేట పాటిగడ్డ క్వార్టర్స్, కల్లు కాంపౌండ్ ఏరియా, ఎస్‌బీటీనగర్, ప్రకాష్‌నగర్, రాహుల్ బజాజ్ వెనుక ప్రాంతం, చీకోటి గార్డెన్, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఐసీఐసీఐ బ్యాంక్ లేన్, భగవంతాపూర్, గగన్‌విహార్ కాలనీ, షేర్‌ఖాన్ బస్తీ ప్రాంతాల్లో విద్యుత్ కోత ఉంటుందని పేర్కొన్నారు.

మన్మోహన్‌సింగ్ మృతి బాధాకరం

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

సనత్‌నగర్: మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ మృతి చాలా బాధాకరమని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. గొప్ప ఆర్థికవేత్త, సంస్కరణవాదిని కోల్పోయామని ఈ సందర్భంగా ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మన్మోహన్‌సింగ్ మృతి పట్ల ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సంతాపం తెలియజేశారు.

అమిత్‌షా వెంటనే క్షమాపణ చెప్పాలి

లాలాపేట: భారత రాజ్యాంగంపై పార్లమెంట్‌లో చర్చల సందర్భంగా కేంద్ర మంత్రి అమిత్ షా అంబేడ్కర్‌ను అవమానించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు సమాజ్‌వాది పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ప్రొ సింహాద్రి అన్నారు. శుక్రవారం తార్నాకలో విలేకరులతో మాట్లాడారు. అంబేడ్కర్‌ను అవమానించడం అంటే రాజ్యాంగాన్ని, యావత్ భారత జాతిని అవమానించినట్లుగా భావిస్తున్నామన్నారు. దీన్ని తీవ్రమైన చర్యగా పరిగణిస్తున్నట్లు పేర్కొన్నారు. వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలన్నారు.

‘మన్మోహన్ సింగ్ సేవలు మరువలేనివి’

భారత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి చెందడంతో ఆయనకు సనత్‌నగర్, సికింద్రాబాద్, కంటోన్మెంట్ నియోజకవర్గాల్లో పలువురు నాయకులు ఘనంగా నివాళులర్పించారు. మన్మోహన్ దేశానికి చేసిన సేవలను కొనియాడారు. దేశాభివృద్ధికి ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టిన ఘనత మన్మోహన్‌దే అని పేర్కొన్నారు.

రాంగోపాల్‌పేట్: కాంగ్రెస్ పార్టీ ఏ బ్లాక్ అధ్యక్షులు త్రికాల మనోజ్ ఆధ్వర్యంలో రాణిగంజ్‌లోని ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళులు అర్పించారు. రెజిమెంటల్‌బజార్‌లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అల్లాడి గౌరిశంకర్, నందికంటి రవి, శ్రీను తదితరులు ఆయన చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు.

సనత్‌నగర్: సనత్‌నగర్ బస్టాప్, బేగంపేట ఓల్డ్‌కస్టమ్స్‌బస్తీ కార్యాలయాల్లో జరిగిన కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ కోట నీలిమ మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

బన్సీలాల్‌పేట్: జబ్బార్ కాంప్లెక్స్ వద్ద మన్మోహన్ చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ బన్సీలాల్‌పేట్ డివిజన్ అధ్యక్షుడు చిరంజీవి నివాళులర్పించారు. రాణిగంజ్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి రాంగోపాల్‌పేట్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ మన్మోహన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.


రాణిగంజ్‌లో..


రెజిమెంటల్‌బజార్‌లో..

బౌద్ధనగర్: భారత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ సంస్కరణలు మరువలేనివని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవిప్రసాద్ గౌడ్ ఒక ప్రకటనలో కొనియాడారు. మన్మోహన్ సింగ్ మరణం దేశానికి తీరని లోటు అని పేర్కొన్నారు. మన్మోహన్ సింగ్ నిరాడంబర జీవితం, దేశం పట్ల వారి అంకిత భావం భావి తరాలకు స్ఫూర్తి దాయకమని అన్నారు.


సనత్‌నగర్‌లో..


జబ్బార్ కాంప్లెక్స్ వద్ద..


రాణిగంజ్ చౌరస్తాలో..

సీఎం మమ్మల్ని ఆదుకుంటాడు

వాల్ పెయింటింగ్ ఆర్టిస్ట్ అసోసియేషన్ నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ: సీఎం రేవంత్ రెడ్డి మా వాడే... మా సమ్యలను పరిష్కరించి మమ్మల్ని ఆదుకుంటారనే నమ్మకం ఉందని తెలంగాణ వాల్ పెయింటింగ్ ఆర్టిస్ట్ అసోసియేషన్ నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం ఓయూ ఆర్ట్ కాలేజీలో అసోసియేషన్ సదస్సు జరిగింది. కార్యక్రమంలో ఆర్టిస్టుల సమస్యలు, ఆర్థిక ఇబ్బందులు ఇతర అంశాలపై చర్చ జరిగింది. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు శ్రీరామ్ మాట్లాడుతూ దేశ చరిత్రలో గతంలో ఎన్నడూ లేని విధంగా పెయింటింగ్ ఆర్టిస్ట్ వృత్తి నుంచి వచ్చిన రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి కావడం గొప్ప విషయమన్నారు. గతంలో ఆర్టిస్టుగా పని చేసిన సీఎం రేవంత్ రెడ్డికి మా సమస్యల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదన్నారు.


మాట్లాడుతున్న వాల్ పెయింటింగ్ ఆర్టిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీరామ్

ప్రభుత్వం తరపున చేపట్టే పెయింట్ (రాత) పనులను నేరుగా ఆర్టిస్టులకు ఇవ్వాలని, హెల్త్‌కార్డులు, పెన్షన్లు, ప్రమాద బీమా, ఇందిరమ్మ ఇల్లు, ఇతర ప్రభుత్వ పతకాలను ఆర్టిస్టులకు వర్తింప చేయాలని కోరారు. ఆర్టిస్టు రాజ్‌నాథ్, వాసు, మాతంగి ఓదెలు, జ్ఞానేశ్వర్, రాజేశ్వర్, కంచర్ల బద్రీ, సాయి, నారాయణ, సుధాకర్ పాల్గొన్నారు.

సందడిగా స్పోర్ట్స్ మీట్

లాలాపేట: తార్నాక సౌత్ లాలాగూడలోని సెంటినరీ బాప్టిస్టు చర్చి వార్షిక క్రీడోత్సవాలు శుక్రవారం లాలాపేటలోని ప్రొ జయశంకర్ స్టేడియంలో ప్రారంభమయ్యాయి. బాప్టిస్టు చర్చ్ సంఘ పెద్దలు, సభ్యులు, మహిళలు, చిన్నా పెద్దా తేడా లేకుండా అందరూ ఆడుతూ సందడి చేశారు. రెండు రోజుల పాటు జరిగే ఈ క్రీడల్లో గెలుపొందిన వారికి నూతన సంవత్సరం జనవరి 1న చర్చిలో జరిగే కార్యక్రమంలో బహుమతులు అందజేస్తామని నిర్వాహకులు స్పోర్ట్స్ కమిటీ తెలియజేశారు. కార్యక్రమంలో చర్చి ప్రసిడెంట్ ఎం. క్రిష్టోఫర్,వైస్ ప్రసిడెంట్ బి. ప్రవీణ్, సెక్రటరీ బి. వరకుమార్ పాల్గొన్నారు.


స్పోర్ట్స్ మీట్‌లో సెంటినరీ బాప్టిస్టు చర్చి బృందం


లెమన్ స్పూన్ క్రీడా పోటీలో పాల్గొన్న మహిళలు

ఘనంగా ధనుర్మాస మహోత్సవాలు

సనత్‌నగర్: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా 12వ రోజు సనత్‌నగర్ హనుమాన్ దేవాలయంలోని శ్రీకల్యాణ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో శుక్రవారం విశేష పూజా కార్యక్రమాలు జరిగాయి. స్వామి వారికి ప్రత్యేక అలంకరణ, పూజా కార్యక్రమాలతో పాటు తిరుప్పావై పాశరాల పారాయణం, శ్రీవిష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం నిర్వహించారు. ఈఓ సత్యనారాయణ పర్యవేక్షణలో ప్రధాన అర్చకులు పరాశరం రవీంద్రాచార్యుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది కాటం శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో శ్రీవారు, ధనుర్మాస పూజోత్సవాల్లో భక్తులు..

కమ్యూనిటీ హాల్‌లో రేపు సంక్రాంతి సంబరాలు

సనత్‌నగర్: సాంప్రదాయాన్ని పాటిద్దాం–సంస్కృతిని కాపాడుదాం..భావి తరాలకు అందిద్దాం..అన్న నినాదంతో మోడల్‌కాలనీ ‘సంస్కృతి’ కమ్యూనిటీ హాల్‌లో ఈ నెల 29 (రేపు) సంక్రాంతి సంబరాలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు కొత్తపల్లి మధుసూదన్‌రావు, డి.బుచ్చిబాబు, మైనేని ప్రసాద్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. అచ్చమైన తెలుగు సంప్రదాయాన్ని నగరం నడిబొడ్డున ఆవిష్కరించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. గంగిరెద్దుల విన్యాసాలు, అచ్చ తెలుగు ఆటపాటలు, రంగురంగుల ముగ్గులు, అతిథుల ప్రసంగాలు, కమ్మనైన తెలుగు భోజనం వంటి కార్యక్రమాలను నిర్వహించి సంక్రాంతి శోభను మరింత రెట్టింపు చేస్తున్నట్లు చెప్పారు. ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సంక్రాంతి వేడుకలు జరుగుతాయని వివరించారు.

ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టిన మన్మోహన్

ఉస్మానియా యూనివర్సిటీ: భారత దేశ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టిన గొప్ప వ్యక్తి మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ అని పలువురు కొనియాడారు. మన్మోహన్ సింగ్ మృతి చెందడంతో ఉస్మానియా యూనివర్సిటీలో ఘనంగా నివాళులర్పించారు. శుక్రవారం ఓయూ పరిశోధక విద్యార్థి కోట శ్రీనివాస్ ఆధ్వర్యంలో మన్మోహన్ సింగ్ చిత్రపటానికి విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో ఆర్ట్స్ కాలేజీ ఎదుట కొవ్వొత్తులతో శ్రద్ధాంజలి ఘటించారు.

వీసీ సంతాపం

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి పట్ల ఓయూ వీసీ ప్రొ.కుమార్ సంతాపం ప్రకటించారు. దేశంలో ఆర్థిక సంస్కరణలు చేపట్టిన డాక్టర్ మన్మోహన్‌సింగ్‌ను 1996లో ఓయూ గౌరవ డాక్టరేట్‌తో సత్కరించిందని గుర్తు చేశారు.

ఉజ్జయినీ మహంకాళి దేవాలయంలో కార్పొరేటర్ పూజలు



రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి దేవాలయంలో రాంగోపాల్‌పేట్ కార్పొరేటర్ చీర సుచిత్ర దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్పొరేటర్ జన్మదినం సందర్భంగా వారు అమ్మవారిని దర్శించుకున్నారు.

ఎన్ఐఎన్ శాస్త్రవేత్త భానుప్రకాష్ రెడ్డికి అరుదైన గౌరవం



లాలాపేట: తార్నాకలోని జాతీయ పోషకాహార సంస్థ (ఎన్ఐఎన్) శాస్త్రవేత్త, బయోకెమిస్ట్రీ విభాగం హెడ్ డా. జి. భానుప్రకాష్‌రెడ్డి నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చర్ సైన్సెస్(ఎన్ఏఏఎస్) ఫెలోగా ఎన్నికయ్యారు. ఈయన గత కొంత కాలంగా న్యూట్రిషనల్ సైన్సెస్ రంగంలో చేస్తున్న పరిశోధనలకుగాను ఈ గుర్తింపు లభించింది. దాదాపు 250 వరకు పరిశోధన పత్రాలను సమర్పించడంతోపాటు పలు అవార్డులు అందుకున్నారు.

మహిళలు ఆర్థిక ప్రగతి సాధించాలి

కాచిగూడ: మహిళలు ఏదో ఒకరంగంలో నైపుణ్యం పెంపొందించుకుని ఆర్థికంగా పురోగతి సాధించాలని, మహిళలు ఎదిగినప్పుడే కుటుంబం, సమాజం బాగుటుందని ఎమ్మెల్సీ ఎల్.రమణ అన్నారు. తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు గుంటక రూప సదాశివ్ అధ్యక్షతన శుక్రవారం నారాయణగూడ పద్మశాలి భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా నూతన సంవత్సర కేలండర్‌ను ఆయన ఆవిష్కరించారు. మహిళలు వంటింటికే పరిమితం కాకుండా వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు.

రెండు రోజులపాటు ఫౌండర్స్ ఫెస్ట్

పంజగుట్ట: నూతన సంవత్సర వేడుకలు అంటే డీజేలు, పాటలు, ఆటలే కాదు వచ్చే ఏడాది నుంచైనా ఏదైనా మంచి వ్యాపారం పెట్టుకుని జీవితంలో స్థిరపడేలా చేసేందుకు అడ్వెంచర్ పార్క్ అనే సంస్థ వారు ‘ఫౌండర్స్ ఫెస్ట్ 2.0’ అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా ఫెస్ట్ బ్రోచర్‌ను శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వాహకులు వికాస్ కాట్రగడ్డ, సానియా, ఇలియాజ్‌లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతన ఆవిష్కరణలతో పరిశ్రమలు స్థాపించిన యువ పారిశ్రామికవేత్తలు, చిన్నచిన్న వ్యాపారాలు చేసుకునే వారిని ఒక్కచోట చేర్చడమే ఈ ఫెస్ట్ ఉద్దేశమమని వారు పేర్కొన్నారు. స్టార్టప్ ప్రారంభించే ముందు ఎదుర్కొనే సవాళ్లు, ప్రభుత్వతోడ్పాటు, మార్కెటింగ్ లాంటి అంశాలు ఇందులో వివరిస్తారన్నారు. గ్రామీణ నేపథ్యం ఉండి ఎక్కువగా చదువుకోకున్నా వ్యాపారంలో స్థిరపడ్డ వారిని కూడా ఈ ఫెస్ట్‌కు ఆహ్వానించినట్లు వారిని ఆదర్శంగా తీసుకుని యువత ప్రభుత్వ ఉద్యోగాలవైపు చూడకుండా కొత్త స్టార్టప్‌ను ప్రారంభించాలని వారు తెలిపారు. డిసెంబర్ 31వ తేదీ మధ్యాహ్నం నాంపల్లి, పబ్లిక్‌గార్డెన్‌లో ఫెస్ట్‌ను ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు ప్రారంభిస్తారని, జనవరి 1వ తేదీ వరకు కొనసాగుతుందని కార్యక్రమానికి 200 పైగా చిన్న, పెద్ద స్టార్టప్ యువ పారిశ్రామికవేత్తలు పాల్గొంటారన్నారు. సుమారు 30 వేల మందికి పైగా యువత, విద్యార్థులతోపాటు కొత్తగా వ్యాపారం చేయాలనుకునేవారు హాజరు కానున్నట్లు, ఎంట్రీ ఉచితమన్నారు.



విస్తరిస్తున్న కృత్రిమ మేధస్సు


సదస్సు సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న శాస్త్రవేత్త రాజాబాబు తదితరులు

ఖైరతాబాద్: కృత్రిమ మేధస్సు అన్ని విభాగాలకు విస్తరిస్తోందని ప్రముఖ శాస్త్రవేత్త యు. రాజాబాబు అన్నారు. శుక్రవారం సాయంత్రం ఖైరతాబాద్ విశ్వేశ్వరయ్య భవన్‌లో ఐఈఐ తెలంగాణ స్టేట్ సెంటర్, మహాత్మాగాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సంయుక్త ఆధ్వర్యంలో ఏరోస్పేస్, రక్షణ రంగంలో కృత్రిమ మేధస్సు పరిజ్ఞాన వినియోగం అనే అంశంపై సదస్సు నిర్వహించారు. సదస్సుకు శాస్త్రవేత్త రాజాబాబు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ ఎఐ ఏరోస్పేస్‌లో డిజైన్ తయారీ, ఇంధన పొదుపు, పరికరాల్లో లోపాలను గుర్తించడం, నాణ్యతను మెరుగుపర్చుకోవడంలో టెక్నాలజీ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. రక్షణ రంగంలో సరిహద్దుల భద్రత, ఆయుధాలు, మానవరహిత వాహనాల వినియోగంలో దోహదపడుతుందన్నారు. డీఆర్‌డీవో విశ్రాంత శాస్త్రవేత్తలు డాక్టర్ వై. శ్రీనివాసరావు, డాక్టర్ ఎం.రామ్మోహన్ బాబులు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగం, విశిష్టతను వివరించారు. ఈ సదస్సులో ఐఈఐ తెలంగాణ స్టేట్ సెంటర్ చైర్మన్ డాక్టర్ జి.వెంకట సుబ్బయ్య, కార్యదర్శి డాక్టర్ కె. సీతారాంబాబు, సహాయ కార్యదర్శి డాక్టర్ ఎల్. నిర్మలా దేవి, వైఎస్ఎన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగం రావడం లేదని యువకుడి ఆత్మహత్య

అడ్డగుట్ట: ఉద్యోగం రావడం లేదని మనస్తాపానికి గురైన ఓ యువకుడు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు.. యాదాద్రి భువనగిరి జిల్లాలోని ఎంకిర్యాల గ్రామానికి చెందిన నకబోయిన రేవంత్‌కుమార్ (25) డిగ్రీ పూర్తి చేశాడు. అయితే ఎంత ప్రయత్నించినా ఉద్యోగం రావడం లేదని మనస్తాపానికి గురయ్యాడు. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి 8.30 గంటల సమయంలో ఘట్కేసర్ – బీబీనగర్ రైల్వే స్టేషన్ల మార్గం మధ్యలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు.

యువకుడు అదృశ్యం


యశోబంత్

అడ్డగుట్ట: ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లిన ఓ యువకుడు అదృశ్యమైన ఘటన తుకారాం గేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర శంకర్ నాయక్ తెలిపిన మేరకు.. ఒడిశాకు చెందిన యశోబంత్(20) కొంత కాలంగా తుకారాంగేట్ నందనార్ నగర్లోని తన బంధువుల ఇంట్లో ఉంటూ స్థానికంగా ఓ ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. ఈ నెల 25న ఉదయం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లిన యశోబంత్ మళ్లీ తిరిగిరాలేదు. దీంతో అతడికి ఫోన్ చేసినా స్పందన లేకపోవడంతో తెలిసిన వారిని, బంధువులను వాకబు చేశారు. ఫలితం లేకపోవడంతో బాధితులు స్థానిక తుకారాం గేట్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజావాణిలో 154 అర్జీలు

లక్డీకాపూల్: భారత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మరణించిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం సెలవు దినంగా ప్రకటించినప్పటికీ మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్‌లో శుక్రవారం యథావిధిగా ప్రజావాణి కార్యక్రమం కొనసాగింది. సెలవు సమాచారం తెలియక పెద్ద సంఖ్యలో ప్రజావాణి కార్యక్రమానికి తరలివచ్చారు. దీంతో ప్రజలు ఇబ్బంది పడకుండా ఉండేందుకు ప్రజావాణి కార్యక్రమాన్ని ఎప్పటిలాగే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 154 అర్జీలు అందాయి. పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖకు సంబంధించి 59, విద్యుత్ శాఖకు 26, రెవెన్యూ శాఖకు 18, హోం శాఖకు 8, వ్యవసాయ శాఖకు 5, ఇతర శాఖలకు సంబంధించి 38 అర్జీలు వచ్చాయి.

గొప్ప ఆర్థిక సంస్కర్తకు ఘన నివాళి: ప్రజావాణి ఇంచార్జి చిన్నారెడ్డి

పదేళ్లపాటు దేశ ప్రధాన మంత్రిగా మన్మోహన్ సింగ్ చేపట్టిన అనేక సంస్కరణలు భావితరాలకు స్ఫూర్తిగా నిలిచాయని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జి. చిన్నారెడ్డి అన్నారు. మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్ లో శుక్రవారం ఏర్పాటు చేసిన సంతాప కార్యక్రమంలో మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ప్రజాపాలన నోడల్ అధికారి దివ్య దేవరాజన్‌తో కలిసి శ్రద్ధాంజలి ఘటించారు.



లాలాపేటలో ఘనంగా మండల పూజ

లాలాపేట: తార్నాక డివిజన్ లాలాపేటలోని లక్ష్మీ గణపతిసాయి అయ్యప్ప దేవాలయంలో శుక్రవారం దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో 34వ అయ్యప్ప మండల పూజా కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. గణపతి హోమంతో మండల పూజా కార్యక్రమాన్ని ప్రారంభించారు. బీజేపీ రాష్ట్ర నాయకులు బండ చంద్రారెడ్డి హాజరై అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు బాల్‌రాజు, గురుస్వాములు రమేష్ గుప్తా, ఎల్ఎల్‌బీ శ్రీనివాసులు గౌడ్, బాబా అశోక్,మహేశ్ ముదిరాజ్ పాల్గొన్నారు.


లాలాపేటలో అయ్యప్ప మండల పూజలో పాల్గొన్న బండ చంద్రారెడ్డి తదితరులు

నిమ్స్ ఓపీ సేవల్లో గందరగోళం..!

- మొదట సెలవు అని ప్రకటన.. ఆ తరువాత వైద్య సేవల కొనసాగింపు
- ఓపీ కోసం వచ్చిన రోగులకు ఇబ్బందులు




లక్డీకాపూల్: భారత మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మరణించిన నేపథ్యంలో నిమ్స్‌లో శుక్రవారం ఉదయం ఓపీ వైద్య సేవలకు సెలవు అని అధికారులు ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సమాచారం తెలియని ఓపీ సేవలు పొందేందుకు రోగులు పెద్ద సంఖ్యలో ఉదయమే ఆస్పత్రికి చేరుకున్నారు. వైద్య సేవలు లేవని చెప్పడంతో అనేక మంది రోగులు ఆందోళనకు గురయ్యారు. ఎంతో దూరం నుంచి వచ్చాం.. తమకు వైద్య సహాయం చేయడంటూ అక్కడి సిబ్బందిని వేడుకున్నారు. ప్రభుత్వం సెలవు ప్రకటించింది మేమేం చేయాలని చేతులెత్తేశారు. అయితే కొద్దిసేపటి తరువాత రోగుల ఆందోళనతో జరిగిన తప్పిదాన్ని యాజమాన్యం సరిదిద్దుకునే ప్రయత్నం చేసింది. ఈ క్రమంలో నిమ్స్‌లో వైద్య సేవలు యథాతథమంటూ హడావుడిగా మరో ప్రకటనను విడుదల చేశారు. అప్పటికే ఓపీ కార్డుల జారీ చేసే సమయం కూడా ముగిసిపోయింది. ఉదయం వచ్చిన రోగులు 9 గంటల వరకు ఎదురు చూసి.. ఇక చేసేది ఏం లేక నిరాశతో వెనుతిరగాల్సి వచ్చింది. ఈ పరిణామాల నేపథ్యంలో అనేక మంది రోగులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ఈ పరిస్థితి బయటపడకుండా ఉండేందుకు నిమ్స్ సెక్యూరిటీ సిబ్బంది తీవ్రస్థాయిలో ప్రయత్నాలు కొనసాగించారు. ఒక దశలో మీడియా ప్రతినిధులను అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఇటీవల కాలంగా నిమ్స్‌లో భద్రత విధులు నిర్వహిస్తున్న ప్రైవేటు సెక్యూరిటీ సిబ్బంది రోగుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నారు. అందులోనూ యాజమాన్యం ఏదైనా నిర్ణయం తీసుకుందంటే.. ఇక సెక్యూరిటీ సిబ్బందిని పట్టలేని పరిస్థితి. ఈ నేపథ్యంలో ఆస్పత్రికి వచ్చే రోగులు అనేక ఇక్కట్లకు గురవుతున్నారు. అయినా సిబ్బంది అధికారులు పట్టీపట్టనట్టు వ్యవహరించడంతో ఆస్పత్రికి వచ్చే రోగులకు నిత్యం అనేక అవస్థలను ఎదుర్కోవాల్సి వచ్చింది. ఇప్పటికైనా ఈ పరిస్థితిని చక్కదిద్దాల్సిందిగా పలువురు రోగులు విజ్ఞప్తి చేస్తున్నారు.



సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి,
వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220378
9912220379